క్లుప్తంగా

కాల భైరవునికి దీప సేవ



విశేష అలంకారంలో శ్రీ కాలభైరవస్వామి

కడప కల్చరల్ : కడప నగరంలోని శ్రీ ఇష్టకామ్యార్థ కాలభైరవ స్వామికి సోమవారం కూష్మాండ దీప సేవ నిర్వహించారు. నగర పరిధిలోని కాలభైరవపురంలోని స్వామి ఆలయంలో అమావాస్య సందర్భంగా ఈ పూజోత్సవం చేపట్టారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మేరువ బాలాజీరావు పర్యవేక్షణలో అర్చకులు శ్రీధర్‌శర్మ స్వామి వారికి పంచామృతాభిషేకం , అష్టోత్తరం, కాలభైరవ స్తోత్రం అనంతరం భక్తులు కూష్మాండ దీపారాధన తదితర పూజాదికాలను చేపట్టారు.

15న చలో విజయవాడ

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: ఈ నెల 15న చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీపీఎం కడప జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్ పేర్కొన్నారు. సోమవారం నగరంలోని సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 15న విజయవాడలో ప్రజా రక్షణ భేరితో లక్ష మందితో బహిరంగ సభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రానికి ద్రోహం చేసిన బీజేపీని రాష్ట్రంలోని వైఎస్‌ఆర్‌సీపీ, టీడీపీ, జనసేన పార్టీలు ప్రశ్నించే సాహసం కోల్పోయాయని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం బి.మనోహర్, ఏ.రామ్మోహన్, జిల్లా కమిటీ సభ్యులు కే.శ్రీనివాసులు రెడ్డి, బి.దస్తగిరి రెడ్డి పాల్గొన్నారు.

అన్నదానం

కడప ఎడ్యుకేషన్: ప్రతి ఒక్కరూ సేవాతత్వాన్ని అలవరచుకోవాలని ఎస్‌టీఎఫ్ జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ అన్నారు. తాను మొక్కు తీర్చుకునే కార్యక్రమంలో భాగంగా కడప ఎర్రముక్కపల్లెలోని నవజీవన్ సేవాశ్రమంలోని వృద్ధులకు, అనాథలకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. చంద్రశేఖర్, ఆయన సతీమణి కలిసి అన్నదానం చేశారు.

వనభోజనానికి తరలిరండి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న తొగట వీర క్షత్రియ సంక్షేమ సంఘం నాయకులు

కడప కార్పొరేషన్: కార్తీక వన భోజన మహోత్సవాన్ని జయప్రదం చేయాలని తొగట వీర క్షత్రియ సంక్షేమ సంఘం నాయకులు కోరారు. సోమవారం ఎర్రముక్కపల్లెలోని శ్రీ చౌడేశ్వరి దేవి ఆలయంలో వన మహోత్సవ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆ సంఘం నగర శాఖ అధ్యక్షులు కళ్యా సుధాకర్, వర్కింగ్ ప్రెసిడెంట్ పల్లా నరసింహారావు, ప్రధాన కార్యదర్శి ఎస్. రామచంద్రుడు, కోశాధికారి టి. సుదర్శన్, గౌరవాధ్యక్షుడు గోవిందు నాగరాజులు మాట్లాడారు. డిసెంబర్ 10వ తేదీ రాజంపేట రోడ్డు కనుమలోపల్లి వద్దనున్న 108 శివలింగాల మహా శివలింగేశ్వర స్వామి ఆలయం వద్ద ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.

కార్మికుల సమస్యలను పరిష్కరించాలి



మాట్లాడుతున్న ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్. నాగసుబ్బారెడ్డి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్. నాగసుబ్బారెడ్డి పేర్కొన్నారు. సోమవారం నగరంలోని హోచిమన్ భవన్‌లో ఏపీ బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న క్లైయిమ్స్ వెంటనే విడుదల చేయాలన్నారు. సంక్షేమ బోర్డు నిధులను భవన నిర్మాణ కార్మికుల సంక్షేమానికి వాడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ కడప జిల్లా అధ్యక్షుడు జి.వేణుగోపాల్, డిప్యూటీ సెక్రటరీ కెసి.బాదుల్లా, జిల్లా ప్రధాన కార్యదర్శి ఉద్దె మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

బాసుదేవ ఆచార్య మృతి పట్ల సంతాపం

కడప కల్చరల్ : సీపీఎం మాజీ ఎంపీ, పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ (రైల్వేస్) మాజీ చైర్మన్ బాసుదేవ ఆచార్య మృతి పట్ల ఎల్ఐసీ ఉద్యోగుల సంఘం ప్రతినిధులు సంతాపం వ్యక్తం చేశారు. ఆయన విశిష్టమైన కార్మిక నేత అని, పశ్చిమ బెంగాల్ లో బాన్కురా పార్లమెంట్ స్థానం నుంచి సీపీఎం తరపున 8 సార్లు గెలిచారని తెలిపారు. అయినా ఎక్కడా దర్పం లేకుండా ప్రజల్లో మమేకం అయి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేశారని కొనియాడారు. ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ (ఎఐఐఇఎ) నిర్వహించిన అనేక సమావేశాల్లో, కార్యక్రమాలలో ఆయన చురుకుగా పాల్గొన్నారని గుర్తు చేసుకున్నారు.

దీపావళి వెలుగు

కడప స్పోర్ట్స్ : కడప నగరంలోని జిల్లా క్రీడాప్రాధికార సంస్థ మైదానంలో కబడ్డీ కోర్టును దీపావళి పర్వదినం పురస్కరించుకుని కబడ్డీ కోచ్ ఆర్.వి. శ్రీధర్ ఆధ్వర్యంలో క్రీడాకారులు దీపాలతో అలంకరించారు. కబడ్డీ కోర్టు చుట్టూ దీపాలు వెలిగించి క్రీడ పట్ల ఉన్న అభిమానాన్ని చాటుకోవడంతో మైదానం దీపం వెలుగుల మధ్య ఆకర్షణీయంగా తయారైంది.

దీపావళి వేడుకల్లో ఎమ్మెల్యే

కడప కార్పొరేషన్: దీపావళి పండుగ సందర్భంగా ఆదివారం సాయంత్రం దీపావళి వేడుకల్లో కమలాపురం ఎమ్మెల్యే పి. రవీంద్రనాథ్‌రెడ్డి పాల్గొన్నారు. స్మిత్ రోడ్‌లోని నివాసంలో ఆయన, సతీమణి అరుణమ్మ, కుమార్తె డా. రమ్యతారెడ్డి, అల్లుడు విజయ్ భాస్కర్‌రెడ్డి, మనుమళ్లతో కలిసి టపాసులు కాల్చి జిల్లా ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకొని టపాసులు కాల్చాలని, దీపావళి పండుగ అందరి ఇళ్లలో వెలుగులు నింపాలని వారు ఆకాంక్షించారు.

టపాసులు పంపిణీ

వైవీయూ : నగరంలోని జేఎస్‌ఓఎస్ ఆర్గనైజేషన్‌లో ఉన్న అనాథ పిల్లలకు జేబీవీఎస్ ది ప్రజర్వర్ సేవా సమితి అధ్యక్షుడు అశోక్ టపాసులను అందజేశారు. దీపావళి పండుగ పురస్కరించుకుని ఆయన విద్యార్థులకు టపాసులు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు పృథ్వీరాజ్, నీరజమణి, సోలమన్‌రాజు, లక్ష్మీకాంత్ పాల్గొన్నారు.

ప్రభుత్వ బాలుర గృహంలో..

కడప కల్చరల్ : స్థానిక ఆశారేఖ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చైర్ పర్సన్ నెమలిదిన్నె నాగవేణి కడప నగరంలోని ప్రభుత్వ బాలుర వసతి గృహంలో దీపావళి వేడుకలను నిర్వహించారు. హోంలోని బాలురకు టపాసులను అందజేశారు. సంస్థ ఆధ్వర్యంలో ప్రతి దీపావళికి అందజేస్తున్నామని నాగవేణి తెలిపారు.



దీపాల వెలుగులో కబడ్డీ కోర్టు



అనాథ బాలలకు టపాసులు అందజేస్తున్న జేబీవీఎస్ ది ప్రజర్వర్ సేవాసమితి సభ్యులు



ప్రభుత్వ బాలుర వసతి గృహంలో టపాసులు పంపిణీ చేస్తున్న నాగవేణి



టపాసులు కాలుస్తున్న కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి, కుటుంబ సభ్యులు



పూజా కార్యక్రమాల్లో కబడ్డీ క్రీడాకారులు

ఉచిత వైద్య శిబిరం



మహిళకు సూచనలిస్తున్న ఆయుర్వేద వైద్య నిపుణులు రవికుమార్

కడప కల్చరల్ : కరోనా అనంతరం దేశీయ వైద్య విధానంలో భాగమైన ఆయుర్వేదానికి ఆదరణ పెరిగిందని ప్రముఖ ఆయుర్వేద వైద్య నిపుణులు డాక్టర్ టి.రవికుమార్ అన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ కడప అన్నమయ్య ఆధ్వర్యంలో కడప నగరంలోని అల్ హబీబా విద్యాసంస్థల ఆవరణలో నిర్వహించిన ఉచిత ఆయుర్వేద శిబిరానికి స్పందన లభించింది. క్లబ్ జిల్లా అధ్యక్షులు పోతుల వెంకట్రామిరెడ్డి, కార్యదర్శి కొండూరు జనార్ధన రాజు, కోశాధికారి దేవతి రవీంద్రనాథ్‌ల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని విద్యావేత్త పి. అక్బర్ ఖాన్ ప్రారంభించారు. దేవ వైద్యుడు ధన్వంతరి జయంతిని పురస్కరించుకొని స్థానిక నాగరవితేజ ఆయుర్వేదిక్ మందుల షాపు నిర్వాహకులు గుంటి విజయ్ కుమార్ బాబు సౌజన్యంతో ఆయుర్వేద వైద్యనిపుణులు టి.రవికుమార్ దాదాపు 80 మందికి పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులను ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో అర్చక సమాఖ్య అధ్యక్షులు విజయ్ భట్టర్, లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

నేడు దుగ్గాయపల్లెలో 'మా నమ్మకం నువ్వే జగనన్నా'

వల్లూరు : మండలంలోని దుగ్గాయపల్లె సచివాలయం ఆవరణలో మంగళవారం మధ్యాహ్నం 2 గంటల నుంచి మా నమ్మకం నువ్వే జగనన్నా కార్యక్రమం జరుగుతుందని ఎంపీడీఓ కేఆర్‌ఎమ్ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ప్రజాప్రతినిధులు, సచివాలయ పరిధిలోని ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.

శనగ బస్తాలు చోరీ

పెద్దముడియం : పెద్దపసుపల గ్రామంలోని పేటవీధిలో ఉన్న పోతనబోయిన గురుదేవి ఇంట్లో శనగ బస్తాలు చోరీకి గురయ్యాయి. గ్రామానికి చెందిన గురుదేవి ఐదు రోజుల క్రితం ఇంటికి తాళం వేసి తన కూతురు దగ్గరికి వెళ్లింది. సోమవారం రోజు ఇంటికి వచ్చిన గురుదేవి ఇంట్లో ఉన్న 8 శనగ బస్తాలు చోరీకి గురయ్యాయని గ్రహించింది. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఆమె తెలిపారు.

శైవ క్షేత్రాలకు కార్తీక శోభ



ప్రత్యేక అలంకారంలో మిట్టమల్లేశ్వరుడు



శివలింగం



ప్రత్యేక అలంకరణలో ఉమామహేశ్వరుడు

- ప్రారంభమైన కార్తీక మాసోత్సవం
- ముస్తాబైన శైవక్షేత్రాలు

పులివెందుల టౌన్ : కార్తీక మాసోత్సవం సోమవారం నుంచి ప్రారంభమైంది. దీంతో శైవక్షేత్రాలు అందంగా ముస్తాబయ్యాయి. భక్తులు పెద్దసంఖ్యలో శివాలయాలకు చేరుకుని కార్తీక పూజలు చేశారు. ఆలయాల్లో కార్తీక దీపాలు వెలిగించి తమ ఇష్టదైవమైన పరమ శివుడిని ఆరాధించారు. మహిళలు తెల్లవారుజామున లేచి తలంటు స్నానం ఆచరించి ఇంటి ముంగిట రంగువల్లులను అందంగా అలంకరించి అందులో కార్తీక దీపాలు వెలిగించారు. ఆలయాలకు వెళ్లి కాయ కర్పూరాలను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు శివునికి బిల్వార్చన, రుద్రాభిషేకం, అభిషేకాలు నిర్వహించారు. పట్టణంలోని మిట్టమల్లేశ్వరస్వామి ఆలయంతోపాటు ఉమామహేశ్వరస్వామి ఆలయం, మండల పరిధిలోని నామాలగుండు సిద్ధలింగేశ్వర స్వామి ఆలయం, పంచలింగాల, గుండాలయ్యకోనలు భక్తులతో కిటకిటలాడాయి. ఆలయ నిర్వాహకులు భక్తులకు ఎక్కడా ఇబ్బంది లేకుండా ప్రత్యేక క్యూలైన్లను ఏర్పాటు చేసి అందరికి దర్శనం కల్పించారు. విద్యుత్ దీపకాంతులతో ఆలయాలను ముస్తాబు చేశారు.

నేటి నుంచి చెన్నూరులో..

చెన్నూరు : చెన్నూరు మండలంలో వివిధ గ్రామాల్లో నెలకొని ఉన్న ప్రధాన శివాలయాల్లో మంగళవారం నుంచి కార్తీక మాస ఉత్సవాలు ఆలయ కమిటీ నిర్వాహకులు నిర్వహిస్తున్నారు. చెన్నూరు పెన్నా నది బొడ్డున వెలసిన మల్లేశ్వర స్వామి ఆలయంలో ఈనెల ఈనెల 14వ తేదీ నుంచి వచ్చేనెల 12వ తేదీ వరకు కార్తిక మాస ఉత్సవాలు నిర్వహించేందుకు కమిటీ నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. ప్రతిరోజు తెల్లవారుజామున 5 గంటల నుంచి 6 గంటల వరకు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. శివపార్వతుల కల్యాణోత్సవాలు గ్రామోత్సవం నిర్వహిస్తున్నారు.

– చెన్నూరు బస్టాండ్ సమీపంలో ఉన్న నాగేశ్వర స్వామి ఆలయంలో ఉత్సవాలకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. మండలంలోని శివాల్ పల్లి గ్రామ సమీపంలో ఉన్న కాశీ విశ్వనాథ ఆలయంలో, అలాగే ఉప్పరపల్లి. రామనపల్లి. కొండపేట, బలిసింగాయపల్లి గ్రామ పరిధిలో ఉన్న కై లాసగిరి సిద్ద లింగేశ్వర ఆలయంలో కూడా ఉత్సవాలు జరగనున్నాయి. ఆలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు.



చెన్నూరు పెన్నానది ఒడ్డునగల శ్రీ మల్లేశ్వరస్వామి ఆలయం



విద్యుత్ దీపకాంతులతో వెలుగుతున్న మిట్టమల్లేశ్వరస్వామి ఆలయం

పుష్పగిరిని సందర్శించిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి

వల్లూరు : జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీదేవి కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం పవిత్ర పుణ్య క్షేత్రమైన పుష్పగిరిని సందర్శించారు. మొదట పుష్పగిరి కొండపైన గల శ్రీ లక్ష్మీచెన్నకేశవ స్వామి ఆలయాన్ని సందర్శించారు. అర్చకులు వారికి ఆలయ మర్యాదలతో ఘనంగా స్వాగతం పలికారు. అలాగే శ్రీ సంతాన మల్లేశ్వర స్వామిని దర్శించుకుని స్వామి వారికి అభిషేకం నిర్వహించారు. పవిత్ర పెన్నా నది ఒడ్డున గల రుద్రపాద ఆలయాన్ని సందర్శించారు. ఆలయ అర్చకులు వారికి క్షేత్ర విశిష్టత, చరిత్ర, పంచ నదీ సంగమమైన పెన్నా నది గురించి వివరించారు. తీర్థ ప్రసాదాలను, ఆశీర్వచనాలను అందచేశారు. అనంతరం గ్రామంలోని శ్రీ కామాక్షీ సమేత వైద్యనాథేశ్వర స్వామి ఆలయాన్ని సందర్శించారు. అలాగే పుష్పగిరి పీఠాన్ని సందర్శించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శంకర్ రావు, పురావస్తు శాఖ సిబ్బంది, రెవెన్యూ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



శ్రీ సంతాన మల్లేశ్వర స్వామి ఆలయంలో అభిషేకం చేస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి

పంటలను కాపాడుకునేందుకు నీరు విడుదల

జమ్మలమడుగు : వర్షాలు సక్రమంగా పడకపోవడం వల్ల వేసిన పంటలు ఎండిపోకుండా ఉండాలనే ఉద్దేశంతోనే మైలవరం జలాశయం నుంచి నీటిని విడుదల చేయిస్తున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని మోరగుడి సమీపంలో ఉత్తర కాలువకు ఉపకాలువ అయిన డీబీఆర్ కాలువలకు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యాన సలహాదారు సంబటూరు ప్రసాద్‌రెడ్డితో కలిసి నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే ఉత్తర కాలువకు సంబంధించిన ఉప కాలువల్లో జంబు ఎక్కువగా నిండుకోవడంతో తొలగింపు పనులను చేపట్టినట్లు తెలిపారు. కాలువల్లో నీరు వేగంగా ప్రవహించి రైతులు వేసిన పంటలకు అందేలా కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలోవైఎస్సార్‌సీపీ నాయకుడు సుధాకర్ రెడ్డి, తదితరలు పాల్గొన్నారు.



డీబీఆర్ కాలువకు నీటిని విడుదల చేయిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

బకాయి డబ్బులను వెంటనే చెల్లించాలి

కడప ఎడ్యుకేషన్: ఉపాధ్యాయులు ప్రావిడెంట్ ఫండ్ రూపంలో దాచుకున్న డబ్బులను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా, జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్‌బాబు అన్నారు. సోమవారం కడప యూటీఎఫ్ కార్యాలయంలో జరిగిన ప్రాంతీయ మండలాల సమావేశంలో వారు మాట్లాడారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఉద్యోగ, ఉపాధ్యాయులకు బకాయి పడ్డ సొమ్ములను వెంటనే చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ట్రెజరర్ నరసింహారావు, జిల్లా కార్యదర్శి ఏజాస్ అహ్మద్, అడిట్ కమిటి కన్వీనర్ ప్రభాకర్, నాయకులు చంద్రశేఖర్, వీరనారాయణ, శ్రీనివాసులు, నాగిరెడ్డి తదతరులు పాల్గొన్నారు.

వన్‌టౌన్ సీఐగా భాస్కర్‌రెడ్డి



నూతన సీఐకి స్వాగతం పలుకుతున్న సీఐ నాగరాజు

కడప అర్బన్: కడప వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ సీఐగా సి. భాస్కర్‌రెడ్డి సోమవారం బాధ్యతలు చేపట్టారు. చిత్తూరు జిల్లా యాదమర్రికి చెందిన ఆయన ఎస్ఐగా 1991లో జిల్లాలో సంబేపల్లి ఎస్ఐగా విధుల్లో చేరారు. తరువాత లింగాల, కడప వన్‌టౌన్‌తో పాటు పలు చోట్ల ఎస్ఐగా పనిచేశారు. 2008లో సీఐగా పదోన్నతి పొందిన తరువాత జిల్లాలో మైదుకూరు టౌన్, సీసీఎస్ కడప, జమ్మలమడుగు రూరల్, పులివెందులలో పనిచేశారు. తిరుపతి, నెల్లూరు జిల్లాలలో పనిచేశారు. తిరుపతి ట్రాఫిక్ నుంచి కడప వన్‌టౌన్‌కు బదిలీ అయ్యారు. బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు సీఐగా పనిచేసిన నాగరాజు అనంతపురం బదిలీ అయ్యారు.

సీఐ నాగరాజు సేవలు స్ఫూర్తిదాయకం

– కడప డీఎస్పీ ఎండీ షరీఫ్

కడప అర్బన్: కడప నగరంలోని ఒన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ సీఐగా విధులను నిర్వహించిన ఎన్.వి నాగరాజు సేవలు మరువలేనివని కడప డీఎస్పీ ఎండీ షరీఫ్ కొనియాడారు. సీఐ నాగరాజు అనంతపురం జిల్లాకు బదిలీపై వెళుతున్న సందర్భంగా సోమవారం కడప ఒన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఆయనకు ఘనంగా వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. అనంతరం నూతనంగా సీఐగా బాధ్యతలను చేపట్టిన సీ. భాస్కర్‌రెడ్డికి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో సీఐలు భాస్కర్‌రెడ్డి, నరసింహారెడ్డి, రాజా, తబ్‌రేజ్, పురుషోత్తంరాజు, రామచంద్ర, ఎస్ఐలు రంగస్వామి, మధుసూదన్‌రెడ్డి, సిద్దయ్య పాల్గొన్నారు.

దళితుల ఐక్యతే ముద్దు...వర్గీకరణ వద్దు

కడప కార్పొరేషన్: ఎస్సీ వర్గీకరణ పేరుతో దళితులను విడగొట్టే కుతంత్రాలను మానుకోవాలని జై భీమ్ మాల మహాసేన నాయకులు హితవు పలికారు. సోమవారం ఆ సంఘం కార్యాలయంలో దళిత ప్రముఖులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దళితులు ఐక్యంగా ఉంటే రాజ్యాధికారం మనదే అవుతుందన్నారు. ఇది నచ్చని కొందరు రాజకీయ నాయకులు విభజించు–పాలించు నినాదంతో ఎస్సీ వర్గీకరణ అంశాన్ని తెరపైకి తెస్తూ దళితుల మధ్య చిచ్చుపెట్టే ప్రయత్నాలు చేస్తున్నారని మండిపడ్డారు. వర్గీకరణపై కమిటీ వేస్తామని ప్రధాని నరేంద్రమోడీ ప్రకటించడం ఎన్నికల కోసమేనన్నారు. కార్యక్రమంలో జై భీమ్ మాల మహాసేన అధ్యక్షుడు పి. సంపత్ కుమార్, ఉపాధ్యక్షురాలు చైతల్య, దళిత నాయకులు ఎం. విజయ్‌భాస్కర్, కె. సుబ్బరాయుడు, లోకేష్, ఇరగయ్య, వసంత్, ఏ. సుబ్బరాయుడు, చిన్ని, బి. రవి, ప్రశాంత్, చరణ్ పాల్గొన్నారు.



ఐక్యత చాటుతున్న జై భీమ్ మాల మహాసేన నాయకులు

మాల మాదిగలను విడదీయడం సరికాదు

కడప కోటిరెడ్డిసర్కిల్ : అన్నదమ్ములుగా ఉన్న మాల మాదిగలను విడదీయడం సరికాదని ఏపీ మాల మహానాడు రాయలసీమ అధ్యక్షులు ఇల్లూరి సురేష్ అన్నారు. సోమవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులను సద్వినియోగం చేసుకోవాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : ప్రస్తుత కార్తీక మాసంలో వివిధ శైవ క్షేత్రాలకు నడుపుతున్న ప్రత్యేక బస్సు సర్వీసులను భక్తులు సద్వినియోగం చేసుకోవాలని కడప డిపో ఇన్‌ఛార్జి మేనేజర్ కన్యాకుమారి తెలిపారు. ప్రతి కార్తీక సోమవారం ఉదయం 5 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు పంచ క్షేత్ర దర్శిని బస్సును నడుపుతున్నామన్నారు. అలాగే పొలతల, నిత్యపూజకోనతోపాటు శ్రీశైలంకు ప్రత్యేక సర్వీసులు నడపనున్నామన్నారు. అదేవిధంగా అయ్యప్పస్వామి భక్తులకు కూడా ప్రత్యేక బస్సులు నడుపుతున్నామని, వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కార్పొరేట్ సంస్థలకు కొమ్ముకాస్తున్న బీజేపీ

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు కొమ్ముకాస్తున్నదని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండి జకరయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్తార్ పేర్కొన్నారు. సోమవారం నగరంలోని ఇందిరాభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వలేదన్నారు, పోలవరం ప్రాజెక్టుకు నిధులు ఇవ్వకుండా ఇంతవరకు పూర్తి చేయలేదన్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించడంలో మోడీ ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు హరిప్రసాద్, కదిరి ప్రసాద్, రత్నం తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో వ్యాక్సిన్లు వేయించుకోవాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : అంగన్వాడీ కేంద్రాల ద్వారా గర్భవతులు, బాలింతలు సకాలంలో వ్యాక్సిన్లు వేయించుకోవాలని, అలాగే చిన్నారులకు వేయించాలని అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యులు డాక్టర్ హర్షవర్ధన్ సూచించారు. సోమవారం నగరంలోని మారుతినగర్, రాజారెడ్డివీధుల్లో ఆరోగ్య సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాలకు వచ్చే వారు ప్రాథమిక దశలోనే ఆరోగ్య పరీక్షలు నిర్వహించుకుని సరైన సమయంలో మందులు వాడాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు జ్యోతిష్, కారుణ్య, ఆరోగ్య అధికారిణి ప్రసన్నలత, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం



కడప ఎడ్యుకేషన్: కడప అరవిందనగర్ పటేల్ రోడ్డులోని చిట్టచివరి వీధిలోని రహదారిలో ప్రమాదం పొంచి ఉంది. ప్రధాన రోడ్డులోని మ్యాన్‌హోల్‌పై ఏర్పాటు చేసిన కప్పు గతంలో వాహనాల దాటికి పగిలిపోయింది. దాంతో ఎలాంటి ప్రమాదం జరగకుండా స్థానికులు ఒక రాయిని ఏర్పాటు చేశారు. అది కూడా ఇటీవల వాహనాలు ఎక్కి పగిలిపోయింది. ఇటీవల కొంతమంది స్కూటరిస్టులు అందులో పడి ప్రమాదాలకు గురైన సందర్భాలు ఉన్నాయని స్థానికులు అంటున్నారు. దీంతోపాటు కారు చక్రాలు అందులో పడి ఇబ్బందులు పడిన సందర్భాలు ఉన్నాయన్నారు. నగర పాలక అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలి

– డిప్యూటీ సీఎంకు ఆపస్ వినతి



డిప్యూటీ సీఎం అంజాద్‌బాషకు వినతిపత్రాన్ని సమర్పిస్తున్న ఆపస్ నాయకులు

కడప ఎడ్యుకేషన్: రాష్ట్రవ్యాప్తంగా చాలాకాలంగా అపరిష్కృతంగా ఉన్న ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఆపస్ రాష్ట్ర సహాధ్యక్షుడు రామమోహన్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి సుబ్బరాయుడు కోరారు. ఈ విషయమై సోమవారం డిప్యూటీ సీఎం అంజాద్‌బాషను కడపలో కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చాలాకాలంగా అపరిష్కృతంగా ఉన్న విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యలను స్థానిక శాసనసభ్యుల ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలనే ఆపస్ రాష్ట్రశాఖ ఆదేశాల మేరకు ఈ రోజు కడపజిల్లా ప్రధాన కార్యదర్శి కొండారెడ్డి ఆధ్వర్యంలో డిప్యూటీ సీఎంకు వినతిపత్రాన్ని సమర్పించామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు వెంకటరామిరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు సుధాకర్‌రెడ్డి, నాగరాజు, శ్రీనివాసులు, జిల్లా మీడియా ఇన్‌చార్జు బాలకృష్ణుడు పాల్గొన్నారు.